నిరాహార దీక్షను జయప్రదం చేయండి

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : మోడల్ స్కూల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 21వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే నిరాహార దీక్షను జయప్రదంచేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం సంఘం జిల్లా కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి సురేష్, సాత్విక్, మోహన్‌రావు పాల్గొన్నారు.

'త్రివేణి'లో రాఖీ వేడుకలు

టూటౌన్ సీఐకి రాఖీ కడుతున్న విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : నగరంలోని త్రివేణి స్కూల్‌కి చెందిన విద్యార్థులు ఆదివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లోని రక్షకభటులందరికీ రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం సమాజాన్ని అసాంఘిక శక్తుల నుంచి రక్షించే బాధ్యతలను నిర్వహిస్తున్న పోలీసులకు రాఖీ కట్టడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మామిళ్లగూడెం, ఆగస్టు 18 : మానసిక ఇబ్బందులతో బాధ పడుతున్న వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరం పాకబండబజార్‌కి చెందిన గుంజి నరసింహారావు(40) వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా మెదడు సంబంధ జబ్బుతో బాధ పడుతున్నాడు. ఇటీవల వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నాడు. వైద్యులు మద్యం తాగకూడదని చెప్పినప్పటికీ తాగుతూనే ఉన్నాడు. ఈక్రమంలో మద్యం మత్తులో వెంకటగిరి గేట్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపారు.

అంకమ్మ ఆలయంలో చోరీ

రఘునాథపాలెం, ఆగస్టు 18 : ఖమ్మం నగరం 4వ డివిజన్ పరిధిలోని అంకమ్మ తల్లి ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ తాళాలు పగులగొట్టిన దొంగలు రూ.3 లక్షల వెండి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. రోజూ మాదిరిగానే ఆదివారం ఉదయం ఆలయాన్ని తెరిచేందుకు వచ్చిన పూజారి చోరీ విషయాన్ని గమనించి ఆలయ కమిటీకి తెలిపాడు. అమ్మవార్ల రెండు వెండి కిరీటాలు, పుస్తెలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆలయ సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు వ్యక్తులు ముఖానికి ముసుగులతో వచ్చినట్లు గుర్తించారు. దీనిపై ఖానాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నర్సింహారావు తెలిపారు.

21న ఆయుర్వేద వైద్య శిబిరం

కొణిజర్ల, ఆగస్టు 18: కొణిజర్ల పీహెచ్‌సీలో ఈ నెల 21న వృద్ధులకు ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.రాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వృద్ధులు ఉపయోగించుకోవాలని కోరారు.

బహుజన బిడ్డ సర్వాయి పాపన్న గౌడ్

ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ వద్ద పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు

వైరాలో..

కారేపల్లిలో..

వేంసూరులో.

కూసుమంచి మండలంలో..

ఖమ్మం రూరల్ : చింతపల్లి గ్రామంలో కేక్ కట్ చేస్తున్న గౌడ సంఘం నాయకులు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఆదివారం పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వెనుకబడి నవర్గాల కోసం 400 ఏండ్ల క్రితమే పోరాడిన గొప్ప వీరుడు పాపన్నగౌడ్ అని ఈ సందర్భంగా వక్తలు ఆయన్ని కొనియాడారు. ప్రతి ఒక్కరూ మహనీయుల ఆశయాల సాధనకు అంకితమై పని చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత మెరుగైన సమాజం కోసం కృషిచేసిన మహానుభావులందరినీ స్మరించుకుంటున్నామన్నారు. బహుజనులకు రాజ్యాధికారం కోసం మొగలు రాజులను చీల్చి చెండాడి వాళ్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరుడు పాపన్నగౌడ్ అని పేర్కొన్నారు. 12మంది సైన్యంతో ఏర్పాటైన తన ప్రస్థానం అంచలంచెలుగా 12వేల మంది సైన్యాన్ని తయారుచేసి గోల్కొండ కోటను ఏలిన గొప్పవీరుడు, బహుజన బిడ్డ పాపన్నగౌడ్ అని కొనియాడారు.

– నమస్తే నెట్‌వర్క్

ఖమ్మంలో ఆదివారం జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కాజా శరత్ దంపతులు, జనగామ శాసనసభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శాసన సభ్యుడు అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు

స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం

వైరా ఏసీపీ ద్వారా సాయం అందజేస్తున్న స్నేహితులు

వైరాటౌన్, ఆగస్టు 18: బాల్యంలో తమతోపాటు కలిసి చదువుకున్న ఇద్దరు స్నేహితులు మృతిచెందడంతో వారి కుటుంబాలకు స్థానిక మధుఠాగూర్ 1997-98 బ్యాచ్ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. మానసిక సమస్యతో బాధపడుతున్న మరో స్నేహితునికి కూడా సాయం అందించారు. వైరాకు చెందిన తల్లపురెడ్డి కొండారెడ్డి కుటుంబానికి రూ.50 వేలు, వైరా మండలం కొష్టాల గ్రామానికి చెందిన మానసిక సమస్యతో బాధపడుతున్న మరో స్నేహితుడు లింగాల ప్రసాద్‌కు రూ.40 వేలు, వైరాకు చెందిన సూతకాని రజనీకాంత్ కుటుంబానికి రూ.30 వేలను వైరా ఏసీపీ రెహమాన్, వర్తక సంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు ద్వారా ఆదివారం అందించారు. పూర్వ విద్యార్థులు మిట్టపల్లి కిరణ్‌కుమార్, నందిగామ మనోహర్, సముద్రాల మురళీకృష్ణ, బట్టు నరసింహారావు, సింగు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బోడేపూడి వైద్య శిబిరం

వైద్య సేవలందిస్తున్న వైద్యులు

వైరా టౌన్, ఆగస్టు 18: స్థానిక బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం జరిగింది. వైద్యులు చీకటి భారవి, పిల్లల మర్రి సుబ్బారావు వైద్య సేవలు అందించారు.

కుంచపర్తి విద్యార్థికి బంగారు పతకాలు

బంగారు పతకం సాధించిన ఉంగుటూరు వేణు

వేంసూరు, ఆగస్టు 18: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వేంసూరు మండలం కుంచపర్తి గ్రామానికి చెందిన ఉంగుటూరు వేణు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతాకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ నెల 17, 18 తేదీల్లో మెదక్ జిల్లాలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. షాట్‌పుట్, జావెలిన్‌త్రో విభాగాల్లో ప్రథమ స్థానాల్లో నిలిచి రెండు బంగారు పతకాలను సాధించాడు. ఈ విజయంపై అడసర్లపాడు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జుబ్బూరు రాఘవ, కుంచపర్తి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేణు ఖమ్మంలోని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు.

సమస్యల పరిష్కారానికి వినతి

పీవోతో మాట్లాడుతున్న నాయకులు

సత్తుపల్లి, ఆగస్టు 18: స్థానిక పీవీఎన్ ఆర్ సెంటెనరీ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎర్ర భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎర్రా భాస్కర్, నాగప్రకాశ్, రామారావు, కోటి పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు అస్వస్థత



చికిత్స పొందుతున్న కూలీలు

పెనుబల్లి, ఆగస్టు 18: తల్లాడ మండలం అన్నారుగూడెం మిర్చి తోటలో కూలీలు అస్వస్థులయ్యారు. ఈ గ్రామానికి చెందిన కూలీలు కె.శ్రీనివాసరావు, కె.కృష్ణయ్య, జి. భద్ర య్య, లక్ష్మణరావు, వీరగోపాలరావు, గోపి, కె.భద్రయ్య, కె.పవన్ కలిసి ఆదివారం వరి పొలంలో మందులు, గుళికలు చల్లారు. ఎండ తీవ్రతతో వారంతా అస్వస్థులయ్యారు. వారిని తోటి కూలీలు కల్లూరు వైద్యశాలకు తరలించారు. వైద్యులు వెంటనే చికిత్స అందించారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

వైరా టౌన్, ఆగస్టు 18: ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ మృతిచెందాడు. సోమవరం నల్లచెరువు సమీపంలో ఆదివారం సాయంత్రం ఇది జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కొణిజర్ల మండలం లాలాపురం గ్రామానికి చెందిన బందెల కృష్ణయ్య(45) ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్నాడు. గట్టు ఎక్కిస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద స్థలాన్ని వైరా ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ పరిశీలించి కేసు నమోదు చేశారు. కృష్ణయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రెండు కార్లు ఢీకొని ఏడుగురికి గాయాలు

ప్రమాద స్థలంలో దెబ్బతిన్న కార్లు

కూసుమంచి (నేలకొండపల్లి), ఆగస్టు 18: కోదాడ-నేలకొండపల్లి జాతీయ రహదారిపై తిరుమలాపురం వద్ద ఆదివారం రెండు కార్లు ఢీకొన్నాయి. కోదాడ నుంచి ఖమ్మం వెళుతున్న కారు, ఖమ్మం నుంచి కోదాడ వెళుతున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు కార్ల ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిలో ప్రయాణిస్తున్న ముదిగొండ మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన ఎండీ రిజ్వాన్, ఎండీ సలీం, ఎండీ సారా, ఎండీ గోదా తీవ్రంగా గాయపడ్డారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. నేలకొండపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

మధిర, ఆగస్టు 18: స్థానిక సిద్ధారెడ్డి బజార్‌కు చెందిన రాకేష్ వర్ధంతి సందర్భంగా దీర్ఘకాలిక అనారోగ్య బాధితులైన ఇద్దరి కుటుంబాలకు నెలకు సరిపడినన్ని నిత్యావసర సరుకులను ఆయన తల్లి తేళ్లూరి శశికళ ఆదివారం అందజేశారు. జానపద కళాకారుడు బాబ్లా తదితరులు పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న శశికళ తదితరులు

మాజీ ఎంపీపీకి సన్మానం

శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న తండా వాసులు

కూసుమంచి, ఆగస్టు 18: ఎంపీపీగా పదవీకాలం పూర్తిచేసుకున్న బాణోత్ శ్రీనివాస్‌తోపాటు మాజీ సర్పంచ్ అయిన ఆయన సతీమణి సరస్వతిని మండలంలోని స్వగ్రామం గోరీలపాడుతండాలో గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. తండాలోని ఉద్యోగులు, విద్యావంతులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన కంపెనీ ప్రతినిధుల పట్టివేత

మొక్కజొన్న బెండ్లను చూపుతున్న బాధిత రైతులు

పెనుబల్లి, ఆగస్టు 18: తమకు నకిలీ విత్తనాలు అంటగట్టారన్న ఆగ్రహంతో ఓ విత్తన కంపెనీ ప్రతినిధులను రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మండలంలోని పార్థసారథిపురం గ్రామానికి చెందిన ఐదుగురు రైతులు, ఏపీలోని తిరువూరులో ఓ సీడ్ కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తనాలను డీలర్ వద్ద కొనుగోలు చేసి సాగు చేపట్టారు. మూడు నెలలు దాటినా కూడా దిగుబడి రాలేదు. మొక్కజొన్న కంకులకు విత్తనాలు రాలేదు. కంకులు సన్నగా, మొక్క బలహీనంగా ఉన్నాయి. దీంతో ఆ రైతులు పలుమార్లు సంప్రదించినప్పటికీ సదరు విత్తన డీలర్ పట్టించుకోలేదు. ఆ గ్రామానికి ఆదివారం వచ్చిన ఆ సీడ్ కంపెనీ ప్రతినిధులను బాధిత రైతులు పట్టుకుని, వీ.ఎం.బంజర పోలీసులకు అప్పగించారు. మూడు నెలలపాటు పంట నష్టపోయామంటూ ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని, విత్తన డీలర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ మోటర్ల చోరీపై కేసు

చింతకాని, ఆగస్టు 18: మండలంలోని బస్వాపురం రెవోన్యూ గ్రామ పరిధిలోగల వ్యవసాయ క్షేత్రాల్లో రెండు విద్యుత్ మోటర్లు గత నెల 31న చోరీ అయ్యాయి. అప్పటి నుంచి వాటి ఆచూకీ తెలియక పోవడంతో రైతు తూము అంజయ్య, ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై షేక్ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

చింతకాని, ఆగస్టు 18: మండలంలోని మత్కేపల్లి నామవరం గ్రామస్తురాలు చిక్కుళ్ళ సరిత(29) ఆదివారం తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనికి కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని ఎస్ఐ షేక్ నాగుల్‌మీరా పరిశీలించారు. సరితకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సమస్యలపై సర్వే

వైరా టౌన్, ఆగస్టు 18: పట్టణంలోని హనుమాన్‌బజార్, సోమవరం తదితర ప్రాంతాల్లోని సమస్యలపై ఐద్వా నాయకులు ఆదివారం సర్వే చేశారు. గుడిమెట్ల రజిత, బత్తుల ప్రమీల, బందెల అమృతమ్మ, రాయల సౌజన్య, బండారు కరుణ, బందెల సుశీల తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణ మాఫీ సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న నాయకులు

వైరా టౌన్, ఆగస్టు 18: రైతుల రుణ మాఫీ సమస్యలు పరిష్కరించాలని, రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతులకు కూడా రుణ మాఫీ డబ్బులు జమ చేయాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ పూర్తయిందని ప్రకటించారని, కానీ 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని అన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే.లాల్‌అహ్మద్, కొప్పుల వెంకటేశ్వరరావు, వైరా సొసైటీ మాజీ అధ్యక్షుడు మందడపు మధుసూదన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, నాయకులు మాదినేని ప్రసాద్, మేదరమెట్ల పూర్ణయ్య, మోత్కూరు వెంకటేశ్వరరావు, రామారావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి రామారావు, బాణాల శ్రీనివాసరావు, పైడిపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని నిందితులను శిక్షించాలి

కొణిజర్ల : నిరసన తెలుపుతున్న నాయకులు

సత్తుపల్లి : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కొణిజర్ల, ఆగస్టు 18: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారాన్ని నిరసిస్తూ మండలంలోని ఎల్లన్ననగర్ గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఆలకుంట తారకమ్మ, రాపోలు కృష్ణ, వెంకటమ్మ, చింతామణి, సుక్కి విజయ, కవిత తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి టౌన్, ఆగస్టు 18: జూనియర్ డాక్టర్ హత్యాచారాన్ని నిరసిస్తూ హంతకుల దిష్టిబొమ్మను ఐద్వా, సీపీఎం నాయకులు ఆదివారం సిద్ధారం గ్రామ సెంటర్‌లో దహనం చేశారు. జాజిరి జ్యోతి, జాజిరి శ్రీనివాస్, ఎలగం కృష్ణ, అయినంపూడి సునందరావు, ఎలగం రాములు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో యువకుడు మృతి

దుమ్ముగూడెం, ఆగస్టు 18: పాముకాటుతో యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం మండల పరిధిలోని నడికుడిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మడకం కామరాజు (26) గ్రామ శివారులోని పోడు పొలంలో కలుపు మందు పిచికారీ చేస్తున్నాడు. అదే సమయంలో పాము కాటు వేయడంతో కామరాజు కేకలు వేశాడు. చుట్టుపక్కల కూలీలు, రైతులు వచ్చి రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో భుజాన వేసుకుని రెండు కిలోమీటర్లు నడిచి గ్రామానికి చేరుకుని ఆటోలో ముకలపాడు పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

మహిళకు పాము కాటు

ఆళ్ళపల్లి, ఆగస్టు 18: మండల కేంద్రానికి చెందిన మద్దెల లలిత ఆదివారం పాముకాటుకు గురైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతి రోజూలానే లలిత పొలం పనులకు వెళ్తుంటే పొదల్లో ఉన్న పాము కాటు వేసింది. గమనించిన స్థానికులు ఆమెను వెంటనే స్థానిక వైద్యశాలకు అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న దాతలు

రఘునాథపాలెం, ఆగస్టు 18: ఖమ్మానికి చెందిన పెండెం సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన మూడో వర్ధంతి సందర్భంగా వారి కొడుకు, కోడలు అయిన పెండెం పూర్ణచంద్రరావు, సునీత దంపతులు ఖమ్మంలోని శ్రీదుర్గాభవానీ వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలోని సుమారు 70 మంది వృద్ధులను అన్నదానం చేశారు.

ఉపకులాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతోంది

చండ్రుగొండ, ఆగస్టు 18 : ఎస్సీ ఉపకులాల మధ్య బీజేపీ, టీడీపీలు చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి మేకతోటి కాంతయ్య విమర్శించారు. ఆదివారం స్థానిక ఎస్సీ కాలనీలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా బడుగు శంకర్‌ను నియమించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **నందమూరి చెన్నారావు**, S/o : **నందమూరి శేషగిరి రావు (లేట)**, **వయస్సు** : 38 సం॥లు, **వృత్తి** : డ్రైవరు, **నివాసం** : ఇ.నెం. 1-114, మర్లపాడు, వేంసూరు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్షయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిష్టారు మరియు జిల్లా పరిషత్ ఖమ్మం, వేంసూరు మండల పరిషత్, సత్తుపల్లి సబ్ రిజిష్టారు వారి ఇలాఖా మర్లపాడు గ్రామ పంచాయితీ వేంసూరు గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా పర్లపాడు గ్రామములో సిద్ధారం పోవు రోడ్డులో మెయిన్ రోడ్డుకు ఆనుకొని వున్న 256 చ॥గ॥లు స్థలము మరియు అందు నిర్మించి యున్న 1-114 నెంబరు గల ఆర్.సి.సి. గ్రౌండ్ ఫ్లోర్ ఇల్లు (257 S.F.T) రేకుల వసార, కరెంటు సర్వీసు కనెక్షను నెంబరు 34302-00702, టాయిలెట్స్ మంచి నీటి పంపు, యుక్తముగా వున్న ఆస్తి యందు మీ వాటా పోను నాకు గల అనిర్విష్టపు వాటా అనగా 1/2వ వంతు వాటా అనగా 128 చ॥గ॥లు వెరశి, **డాక్యుమెంట్ నెం. 1504/2024** గల పూర్తి ఆస్తికి సరిహద్దులు : **తూర్పు**: మాకరాజు మల్లిఖార్జునరాజు గారి ఇల్లు (ఇ.నెం. 1-115), **పడమర** : గ్రామ పంచాయితీ రోడ్డు, **ఉత్తరం** : మనకు చెందిన ఖాళీ స్థలము, **దక్షిణం** : మర్లపాడు టూ సిద్ధారం పోవు ఆర్&బి రోడ్డు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **వర్రా గోపి**, S/o : **రాములు**, **వయస్సు** : 30 సం॥లు, **వృత్తి** : వ్యవసాయం, **నివాసం** : కందుకూరు గ్రామం, వేంసూరు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్షయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిష్టారు జిల్లా పరిషత్ ఖమ్మం, సత్తుపల్లి రిజిష్టారువారి ఇలాకా, వేంసూరు మండల పరిషత్, కందుకూరు గ్రామ పంచాయితీ, కందుకూరు గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా కందుకూరు గ్రామ పంచాయితీ, కందుకూరుగ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా కందుకూరు గ్రామంలో వున్న సర్వే నెం. 976ఆ/ఆ1/1లో 242 చ॥గ॥లు, **డాక్యుమెంట్ నెం. 1445/2024** గల ఖాళీ నివేశన స్థలమునకు సరిహద్దులు : **తూర్పు**: కందుకూరు – గుడిపాడు ఆర్ అండ్ బి రోడ్డు – ఆస్తి కొలత 42 అడుగులు, **దక్షిణం** : గిప్ట్ పరిచిన వారి మిగిలిన భూమి – ఆస్తి కొలత 52 అడుగులు, **పడమర** : వర్రా వెంకటేశ్వరరావు గారి స్థలము – ఆస్తి కొలత 42 అడుగులు, **ఉత్తరం** : దారి – ఆస్తి కొలత 52 అడుగులు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★**త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు** వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-325790-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.